# 'పింక్' భలే నచ్చింది

జ్వలిత-9989198943

ఈ మధ్య "పింక్" అనే సినిమా చూశాను. స్త్రీ వాదానికి బాసటగా నిలిచే ఒక సీనియర్ సిటిజన్‌గా ఒక బాధ్యత గల న్యాయవాదిగా తన పాత్రను అమితా బచ్చన్ చక్కగా నటించారు.

ఈ సినిమాలో ముఖ్యంగా చెప్పిన అంశం స్త్రీ ఆత్మ గౌరవానికి, ఆత్మాభిమానానికి, స్వేచ్ఛకు ఉన్న ప్రాముఖ్యత వివరించబడింది. చట్టాలపట్ల అవగాహన కలిగించింది. చట్టాలు అమలు పర్చడంలో చిత్తశుద్ధి లోపం గురించి అద్భుతంగా చెప్పబడింది. 'నో' అనే పదానికి ఎంత ప్రాధాన్యాత ఉన్నదో నొక్కి వక్కాణించిన చిత్రం ఇది. " నో " (వద్దు) అనేది ఒక పదం కాదు. ఎటువంటి వ్యాఖ్యానం, వివరణ అవసరం లేని ఒక ఆయుధంగా దర్శకుడు ప్రతిభావంతంగా వివరించాడు.

స్త్రీలపై అత్యాచారాలు జరిగినపుడు పాలనకు ఏజెంట్స్ అయిన పోలీసు, న్యాయ విభాగం బాధ్యతను సవివరింగా వ్యంగ్యంగా చిత్రీకరించారు. బాధితులను నిందితులుగా చూపించే పురుషాధిపత్య వాదనలను చాలా చిత్రాల్లో చూపినట్టుగా కాక భిన్నంగా చూపింది. సమాజంలో అనేక సంఘటనల్లో బాధితులను నిందితులుగా చూడటం చూస్తూనే ఉన్నాం, కాని ఈ సినిమాలో అటువంటి అహంకార పూరిత పలాయనవాదాన్ని తిప్పి కొట్టే బలమైన న్యాయ సూత్రాలను ప్రతిభావంతంగా సరియైన సమయంలో ప్రదర్శించారు. సాధారణంగా బాధితురాళ్ల పట్ల సమాజం వ్యవహరిస్తున్న తీరును కళ్లకు కట్టినట్లు చిత్రీకరించారు.

**యువతులు హింట్స్ ఇస్తారని, సిగ్నల్స్ ఇస్తారనే వాదన**-ఒక సంఘటనలో బాధితురాలు ఇష్టపూర్వకంగానే వెళ్లిందని సరైన బట్టలు ధరించలేదని, శృంగారపరమైన జోక్స్ వేసిందని, తనను చూచి నవ్విందని, తనను తాకుతూ మాట్లాడిందని తను ఒంటరిగా జీవిస్తుందని మధ్యరాత్రి వరకు బయట తిరుగుతుందని కుటుంబాలకు, తల్లిదండ్రులకు దూరంగా ఉంటుందని, మద్యం సేవిస్తుందని అటువంటి మహిళలపై అత్యాచారం చేసే హక్కు ఈ సమాజం పురుషలకు కల్పిస్తుందనే వాదనలను నేరస్తుని తరుపు లాయరు, నిందితుని సంభాషణల ద్వారా చెప్పించాడు. సెన్సార్ బోర్డు ఒకమాటను కట్ చేసినట్టుంది కాని ఇట్లాంటి వారిని 'రాండ్ బోల్తే' అంటాడు నిందితుడు. తెలుగు భాషా సినిమాలో అయితే మన వాళ్లు ఎటువంటి సంశయం లేకుండా 'వ్యభిచారి' అంటారు అనే వారు.

ముగ్గురు యువతులు స్వతంత్ర్యంగా ఉద్యోగాలు చేసుకుంటూ కలిసి ఒక అపార్టుమెంటులో నివసిస్తుంటారు. ఒక రోజు అందులో ఒక యువతితో కలిసి చదువుకున్న యువకునితో పరిచయమైన మరో ఇద్దరు యువకులు కలిసి ఒక పార్టీకి వెళతారు. అక్కడ అందులో మీనల్ ఆరోరా అనే యువతితో రజ్వీర్ అనే యువకుడు అనుచితంగా, అసభ్యంగా తాకుతూ ఉంటాడు. అనేక సార్లు శారీరక బంధాన్ని కోరుతుంటాడు. ప్రతి సారి ఆమె "వద్దు" ( నో ) అని చెపుతూనే ఉంటుంది. అయితే హద్దు మీరి ప్రవర్తించడంతో అక్కడున్న మద్యం సీసాతో అతనిని గాయ పరిచి మిగిలిన తన ఇద్దరు స్నేహితురాళ్ళ తోఅక్కడి నుండి వెళ్లిపోతుంది.

సినిమాలో పై సంఘటన దృశ్యాలేవి ప్రదర్శించబడవు. పాత్రల సంభాషణల ద్వారా తెలియ చెప్తాడు. గాయపడిన యువకున్ని స్నేహితులు హస్పిటల్‌కు చేర్చే ప్రయత్నంతో సినిమా మొదలవుతుంది. సినిమాలోఅశ్లీల పాటలు, అనవసర ఫైటింగులుండవు. కాని సమాజంలోని రాజకీయ ప్రాబల్యం, దాని ప్రభావం స్త్రీలపై నేరాలు, పోలీసు వ్యవస్థ, పలాయనవాదం, మహిళా పోలీసు అధికారి బాధ్యతా రాహిత్యం, మహిళలపై అత్యాచారాల విషయాల కేసుల్లో వారి నిర్లక్ష్యం స్పష్టంగా చెప్పబడ్డాయి.

ముగ్గురు యువతుల చుట్టే కథ అల్లబడింది. ముగ్గురూ అనేక వివక్షలను ఎదుర్కొన్న వారే. ఈశాన్య రాష్ట్రాలకు చెందిన ఆండ్రిన్ జెండర్ వివక్షతో పాటు ప్రాంతీయ వివక్షను ఎదుర్కొంటుంది. మీనల్ అనే యువతి కేంద్రకంగా కథ నడుస్తుంది.

చిత్రంలో ఒక రాజకీయ నాయకుని మేనల్లుడు ఒక యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించినందుకు మద్యం సీసాతో తలమీద కొడుతుంది. అక్కడినుండి తన స్నేహితురాళ్లు ఇద్దరితో కలిసి వెళ్లిపోతుంది. జరిగిన సంఘటన మీద పోలీసులకు ఫిర్యాదు ఇవ్వాలని ప్రయత్నిస్తే పోలీసులు ఈ సంఘటనలో మీదే తప్పని ఫిర్యాదు ఇస్తే ప్రతిరోజు హాజరు కావాల్సి ఉంటుంది అంటూ అసంబద్ధంగా భయపెట్టి కేసు వద్దులే అనుకునేట్టు చేస్తాడు.

యువకులు వాళ్లను ఇల్లు ఖాళీ చేయించమని వాళ్లు మంచి వాళ్లు కారని ఇంటి యాజమానిని బెదిరిస్తారు. రోడ్డు మీద వెళ్లుతున్న అతనిని " హిట్ & రన్ " అంటే తెలియని వాహనంతో గుద్దేసి వెళ్లిపోతారు.

యువతుల నివాసానికి ఎదురుగా ఫ్లాట్‌లో నివసిస్తున్న వృద్ధ న్యాయవాది పాత్రలో అమితాబ్ బచ్చన్ కీలకమైన పాత్ర సినిమాలో వయస్సు రీత్యా వృత్తిని వదిలి చాలా రోజులైన ఎదురింటి యువతులకు జరుగుతున్న అన్యాయాన్ని భరించలేక తిరిగి నల్లకోటుతో బాధ్యతను తీసుకుంటాడు. నిందితురాలు మీనల్‌ను కిడ్నాప్ చేసి తీసుకు వెళ్లడం చూసి లాయర్ దీపక్ సెహగల్ (అమితాబచ్చన్) ఆదుర్దాతో పోలీసు కమిషనర్‌కు, పోలీసు స్టేషన్‌కు ఫోను చేసినా సరైన స్పందన రాక తానే స్వయంగా వీధుల వెంట తెల్లవార్లు వెదుకుతాడు. చివరికి ఆ యువతి అస్తవ్యస్తంగా ఇంటికి చేరుతుంది. తెల్లవారే పోలీసు లొచ్చి మీనల్ అనే యువతిని అరెస్టు చేసి తీసుకు పోతారు.

బాధితులు ఫిర్యాదు చేసినపుడు స్పందించని పోలీసులు యువకుని (అటెమ్ప్డ్ మర్డర్) హత్యాయత్నం నేరం, ఇంకొన్ని నేరాల అభియోగాలతో నాన్ బెయిల్‌బుల్ కేసులతో అరెస్టు చేసి తీసుకు వెళతారు. అమితాబ్ స్వయంగా వచ్చి నిస్సహాయంగా మిగిలిన ఇద్దరు యువతులకు ధైర్యం చెప్తాడు. బైల్ కోసం ప్రయత్నించమంటాడు.

ఆ సందర్భంగా మైనర్లకు, స్త్రీలకు సెలవు రోజు కూడా మెజిస్ట్రేట్ ఇంటి వద్ద కూడా బైల్ సాధ్యపడుతుందని, నేరం జరిగిన ప్రాంతం కాని పోలీసు స్టేషన్ కాక వేరే ప్రాంతపు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులను "జీరో ఎఫ్ఐఆర్' పేరుతో రిజిష్టర్ చేయ వచ్చునని తర్వాత సరైన స్టేషన్‌కు బదిలీ చేయాలని, ఆత్మ రక్షణార్థం చేసిన ప్రయత్నంలో జరిగిన ప్రతిచర్య హత్యా ప్రయత్నం కాదని చట్టంలో ఉన్న అత్యంత కీలకమైన మూడు విషయాలను ప్రేక్షకులకు అవగాహన కలిగిస్తాడు లాయర్. రాజకీయ ప్రభావం వల్ల

న్యాయవాదులెవ్వరు ఆ యువతుల తరుపున వాదించేందుకు అంగీకరించరు. చివరికి అమితాబచ్చన్ ఆ కేసును తీసుకుని నిందితురాలికి బెయిల్ ఇప్పించి ట్రైల్‌కి సిద్ధ పడతాడు.

సినిమాలో ముఖ్య అంశాలన్నీ కోర్టు హాల్లో చెప్పబడతాయి. ఆడవాళ్ల మీద ఆంక్షలు ఎందుకు విధించబడుతున్నాయి, వాటివెనుక పురుషాధిపత్య భావజాలం, వాటిని అమలు పరుస్తున్న ఏజెంట్లు రాజకీయ నాయకులు, పోలీసులు, కొందరు న్యాయవాదుల వాదనలు ప్రోత్సాహకాలు.

స్త్రీ, పురుషుల మధ్య అసమానతలు లేవంటూనే భయంకరమైన వివక్షను గురి చేస్తున్నపుడు వాటిని అధిగమించడం కోసం ఎవరెవరు ఏమి చేయాలన్నది సినిమాలో అద్భుతంగా చిత్రీకరించబడింది.

ఆ యువతులు డబ్బు కోసం దాడి చేశారనే వాదనను ప్రతిపక్ష లాయరు పదేపదే వినిపిస్తున్నపుడు డబ్బు తీసుకోకున్నా డబ్బు తీసుకున్నాము అయినా మాకిష్టం లేనపుడు లైంగిక సంబంధం వద్దు అని చెప్పే హక్కు మాకుందని ఆ యువతి చెపుతుంది. వృద్ద లాయర్ తన భార్య కదలలేని అనారోగ్యంతో హాస్పిటల్‌లో ఉన్నామెకు ముగ్గురు యువతులను పరిచయం చేస్తాడు. వారి పరిస్థితి చెప్తాడు. “ ఆ యువతులు డబ్బులు తీసుకుని ఉండరు ” అనే నమ్మకాన్ని లాయర్ భార్య వ్యక్త పరుస్తుంది. స్త్రీలను నమ్మవలసిన అవసరం ప్రతి ఒక్కరిది అని ఆ విధంగా చెప్పించాడు దర్శకుడు.

మొత్తానికి ఈ సినిమా స్త్రీవాదులకే కాదు ఆడ పిల్లలందరికి ఊరట కలిగిస్తుంది, స్ఫూర్తినిస్తుంది. అయితే పురుషాదిపత్య సమాజ ఏజెంట్లకు టేకేదార్లకు కనువిప్పు కలిగించాలని నేను కోరుకుంటున్నాను. మార్పు రావలసిన చోట రావాలి.

పింక్ అనే ఈ హిందీ సినిమా 2016 సెప్టెంబర్ 16న విడుదలైంది. దీనికి సిబిఎఫ్‌సి యు/ఎ సర్టిఫికెట్ ఇచ్చింది. భారత దేశ న్యాయ స్థానంలో చిత్రీకరించబడిన చిత్రం నిర్మాతలు రవివర్మ మరి సూజిత్ సర్కర్ దర్శకుడు అనిరుద్దరాయ్ చౌదరి, రచయిత రితేష్‌షా. అమితాబ్ బచ్చన్ లాయర్‌గా, తాప్సీ నిందిత యువతిగా మీనల్ ఆరోరాగా ఆమె స్నేహితురాళ్లుగా ఫలక్ ఆలీగా కీర్తి కుల్లర్, ఆండ్రీగా ఆంఢ్రీటరియం నటించారు.

సినిమా అంతా దక్షిణ ఢిల్లీలో చిత్రీకరించబడింది. సావిత్రి నటనతో పోల్చను కాని తాప్సీ అద్భుతంగా నటించింది. అమితాబచ్చన్ నటకు ఇదొక మైలురాయి.అందరూ కుటుంభ సభ్యులందరూ కలిసి చూడతగిన సినిమా ముఖ్యంగా యువత చూడవలిసిందని నా అభిప్రాయం.

........................

జ్వలిత-9989198943,